క్లుప్తంగా

రేపు మోడల్ ప్రవేశ పరీక్ష


సాయిలు, ప్రిన్సిపాల్

టేక్మాల్(మెదక్): మండల కేంద్రమైన టేక్మాల్ తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఈనెల 27న 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలు శుక్రవారం తెలిపారు. ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసిన విద్యార్థులు తమ హాల్ టికెట్లతో సమయానికి పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


కమలాపూర్‌లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కమలాపూర్ ఎస్సీ కాలనీలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీటీసీ రాజు, సీనియర్ నాయకులు శ్రీను ప్రారంభించారు. ఈ రోడ్డు పనులకు రూ.5 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు, బేతయ్య, కేశయ్య, వినోద్, పోచయ్య తదితరులు ఉన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

తూప్రాన్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తూప్రాన్ మండలం రావెల్లి, మనోహరాబాద్, రామాయపల్లి గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరం జరిగింది. ఆయా గ్రామాలలో 92 ఆవులు, 335 గేదెలకు టీకాలు వేసినట్లు జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటయ్య తెలిపారు. పాడిరైతులు తమ పశుసంపద పరిరక్షణ కోసం స్థానిక పశువైద్య సిబ్బంది సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ లక్ష్మి, సిబ్బంది రాజిరెడ్డి, కృష్ణ కుమార్, గోపాలమిత్రలు రామస్వామి, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని చీలాపల్లిలో శుక్రవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ ఛైర్మన్ సంజీవరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయిని మధు ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రవీందర్, నాయకులు సంగమేశ్వర్, పెరుమాండ్లగౌడ్, సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రగతి ధర్మారంలో ర్యాలీ

రామాయంపేట(మెదక్): రాష్ట్రం నుంచి మలేరియాను నివారించేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని డాక్టర్ హరిప్రియ పిలుపునిచ్చారు. మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సిబ్బంది శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రియ మాట్లాడుతూ...గ్రామంలో దోమలు పెరగకుండా అందరూ పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో రైతులకు భూ భారతి చట్టంపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఏఓ శివరామకృష్ణ తెలిపారు. కుకునూరుపల్లిలో ఉదయం 10 గంటలకు, కొండపాకలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశాల్లో రైతులు పాల్గొనాలని కోరారు.

కార్మికులు సమ్మెకు సిద్ధంకండి

దుబ్బాక: సమస్యల పరిష్కారానికి మే 7నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరగబోయే సమ్మెకు ఆర్టీసీ కార్మికులు సిద్ధం కావాలని రాష్ట్ర జేఏసీ కన్వీనర్ ఎండీ మౌలానా పిలుపునిచ్చారు. డిపో జేఏసీ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళనను విరమించే ప్రసక్తేలేదన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇటీవల గాయపడిన మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీఏసీఎస్‌చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కవిత, యాదవరెడ్డి, కిరణ్ తదితరులు ఉన్నారు.

పశువుల ఆస్పత్రి తెరిచేదెప్పుడు?

గ్రామంలో పశువుల ఆసుపత్రి పదిహేనేళ్లుగా మూతపడింది. సొంత భవనం ఉన్నా వైద్యసిబ్బంది నియామకంలేక తెరుచుకోవడం లేదు. దీంతో మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఇది కౌడిపల్లి మండలంలోని కంచన్‌పల్లి పశువైద్యశాల దుస్థితి.

- సిబ్బందిలేక 15యేళ్లుగా మూత
- మూగజీవాలకు అందని వైద్యం
- సొంతభవనం ఉన్నా నియామకాలు సున్నా


కంచన్‌పల్లిలో మూతపడ్డ పశువుల ఆసుపత్రి

కౌడిపల్లి(నర్సాపూర్): కంచన్‌పల్లిలో పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలతోపాటు కోళ్ల ఫారాలు అధికంగానే ఉన్నాయి. కాని పశువైద్యం మాత్రం అందడంలేదు. పశువుల ఆసుపత్రిలో గతంలో విధులు నిర్వహించిన సిబ్బంది రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి సిబ్బంది నియామకం కాకపోవడంతో పదిహేనేళ్లుగా ఆస్పత్రి మూతపడింది. పశువులకు ఏ వ్యాధి వచ్చినా ఆరు కిలోమీటర్ల దూరంలోని కౌడిపల్లికి రావాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. టీకాల సమయంలో మాత్రమే వైద్యసిబ్బంది గ్రామంలో కనిపిస్తారని మళ్లీ కనిపించరని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిని నియమించి పశువులకు చికిత్సలు అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. చికిత్స అందక ఇటీవల ఓ గేదె మృతి చెందిందని గ్రామస్తులు వాపోయారు.

ఎస్ఆర్ఐ చొరవతో భవనానికి కొత్తరూపు

వైద్యసిబ్బంది లేక మూతపడిన పశువుల ఆసుపత్రి భవనం శిథిలమైంది. అయితే గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఎన్ఆర్ఐ బాలకృష్ణారావు పశువుల ఆసుపత్రికి రంగులు వేయించడంతోపాటు మరమ్మతులు చేయించారు. అధికారులు స్పందించి వైద్యసిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

చికిత్స అందడంలేదు



గ్రామంలో పశు వైద్యశాల ఉన్నప్పటికీ సిబ్బంది లేకపోవడంతో పశువులకు వైద్యం అందడటంలేదు. రెండు రోజుల క్రితం ఏం రోగమొచ్చిందో తెలియదుకాని పాడి గేదె మృతి చెందింది. స్థానికంగా వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటే గేదె బతికి ఉండేది. దీంతోపాటు పశువులు, గొర్రెలు, మేకలకు సైతం వైద్యం అందడటంలేదు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలి.

– శ్రీశైలం యాదవ్, కంచన్‌పల్లి

అమ్మాయిలను చదివించాలి


బేటీపడావో బేటీ బచావో కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ

ఐసీడీఎస్ సీడీపీఓ స్వరూపరాణి

చేగుంట(తూప్రాన్): అమ్మాయిలను బాగా చదివించాలని ఐసీడీఎస్ సీడీపీఓ స్వరూపరాణి అన్నారు. మండల కేంద్రమైన చేగుంటలో శుక్రవారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అమ్మాయిలను గొప్పగా ఎదిగేవరకు పెంచాలనే ఉద్దేశంతో బేటీబచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులను 5 సంవత్సరాల వయసు వచ్చే వరకు కచ్చితంగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని తెలిపారు. అనంతరం సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ చిన్నారెడ్డి, నాయకులు పరంజ్యోతి పాల్గొన్నారు.

నేడు ఎంపీపీ సమావేశం

రామాయంపేట(మెదక్): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 26న జరగనుంది. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌తోపాటు పలు శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరవుతారని ఎంపీడీవో సజీలుద్దీన్ తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు


సమావేశమైన ఇందిరమ్మ కమిటీ సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను ఎంపిక చేసేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ కౌశిక అన్నారు. శుక్రవారం మండలంలోని పర్కిబండలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి అర్హులను ఎంపిక చేస్తున్నామన్నారు. లబ్ధిదారులు 600 చదరపు ఫీట్లలోపే ఇండ్లు నిర్మించా లని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సోను ఠాకూర్, డప్పు సాయిలు, శ్రీశైలం, గాంధీ, కొమరవెల్లి, పిట్ల కృష్ణ, రాజు, బుర్రి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మండలానికి 313 ఇందిరమ్మ ఇళ్లు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలానికి 313 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులతో కలిసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.

తీరనున్న నీటి కష్టాలు : ఎమ్మెల్యే


పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: నీటి పైపులైన్ పనులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమృత్ 2 పథకం కింద నర్సాపూర్ మున్సిపాలిటీకి రూ. 12 కోట్లు వచ్చాయని తెలిపారు. ఆ నిధులతో రెండు నీటి ట్యాంకులు నిర్మించడంతో పాటు పైపులైను ఏర్పాటు చేస్తారని తెలిపారు. ట్యాంకుల నిర్మాణం పూర్తయితే పట్టణంలో నీటి సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందన్నారు. అనంతరం ట్యాంకుల నిర్మాణ పనులు పరిశీలించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు, బీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, సత్యంగౌడ్, శేఖర్, భిక్షపతి, బాల్‌రెడ్డి, ప్రసాద్, నర్సింలు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

కౌడిపల్లి(నర్సాపూర్): అకాల వర్షంతో రైతులు ఎండబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. శుక్రవారం సాయంత్రం మండలంలోని తిమ్మాపూర్, కొట్టల, లింగంపల్లి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. ధాన్యం కుప్పల మధ్య నీరు నిలవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. వర్షంతో రాహదారులు, కల్లాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడిసింది. వర్షంతో అన్నదాతలు ధాన్యం కాపాడుకునేందుకు నానా పాట్లు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రెడ్డిపల్లి, కాజీపేట, జక్కపల్లి, తుజాల్‌పూర్ తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం అంగడి ఉండడంతో వర్షంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.


కౌడిపల్లి: తిమ్మాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పల మధ్య చేరిన వర్షం నీరు

కార్మిక హక్కుల కోసం పోరాడుతాం : సీఐటీయూ

నర్సాపూర్ రూరల్: కార్మికుల హక్కుల రక్షణకు నిరంతరం పోరాడుతామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన నర్సాపూర్‌లో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త లేబర్ కోడ్లను తెచ్చి కార్మిక హక్కులను, చట్టాలను కాలరాస్తుందని మండిపడ్డారు. కార్మికులంతా తమ హక్కుల కోసం మేడేను, అదే నెల 20న అఖిల భారత సమ్మెను సైతం విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి

వెల్దుర్తి (తూప్రాన్): రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని తహసీల్దార్ కృష్ణ, పీఏసీఎస్ ఛైర్మన్ అనంతరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్దుర్తి, హస్తాల్‌పూర్‌లలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. సన్నరకం వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు వేసవి శిబిరం


మెలకువలు నేర్చుకుంటున్న విద్యార్థులు

వెల్దుర్తి(తూప్రాన్): అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్, క్రాఫ్ట్, చిత్రలేఖనం విభాగాల్లో ఐదో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు ఈ నెల 24 నుంచి వెల్దుర్తి మండలం బండపోసాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించినట్లు ఆ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరం ఈ నెల 30 వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతీరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు శిక్షణ శిబిరానికి సుమారు 80 మంది విద్యార్థులు హాజరయ్యారు.

వేధింపులు ఆపాలి

మెదక్ మున్సిపాలిటీ: చిరువ్యాపారులపై మున్సిపల్ అధికారుల వేధింపులు ఆపాలని మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మెదక్ పట్టణంలో పుట్‌పాత్‌లపై చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు వేధిస్తున్నట్లు ఆరోపించారు. పుట్‌పాత్‌లపై వ్యాపారాలను తీసేయాలని హుకుం జారీ చేయడం సరికాదని, వేసవి కాలం పోయేంతవరకు వారిని వేధింపులకు గురిచేయవద్దని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, జయరాజ్, ఆర్కే శ్రీనివాస్, కృష్ణారెడ్డి, ప్రభురెడ్డి, నాయకులు లింగారెడ్డి, మహ్మద్ జుబెర్ అహ్మద్ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు : ఎస్ఐ

రేగోడ్(మెదక్): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పోచయ్య హెచ్చరించారు. మండలంలోని పోచారం-టి లింగంపల్లి గ్రామాల శివారులో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వాహనాల తనిఖీలో భాగంగా ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించామని తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని సూచించారు. నంబర్ లేని వాహనాలు కనిపిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం


అవగాహన కల్పిస్తున్న ఏఈఓ వినీత్

పెద్దశంకరంపేట(మెదక్): ఆయిల్‌పామ్ పంట సాగుతో రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని ఏఈఓ వినీత్, లివ్‌పామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్ అన్నారు. శుక్రవారం గొట్టిముక్కులలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు వరి, మొక్కజొన్న, పత్తి పంటలతో పాటు ఆయిల్‌పామ్ పంటను కూడా సాగు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం డ్రిప్‌కు, మొక్కలకు అధిక మొత్తంలో రాయితీలను ఇస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్‌పామ్ పంటపై ఆసక్తి గల రైతులు 80741 94796 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం


మందులు అందిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

ఎమ్మెల్యే రోహిత్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ, మెడిసిటీ అస్పత్రి ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు వైద్య శిబిరం ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, చంద్రబోస్, సత్యం, శర్మ, చిన్నశంకరంపేట ప్రభుత్వ వైద్యసిబ్బంది, మెడిసిటీ అస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య


టేక్మాల్‌లో పహెల్గాం మృతులకు సంతాపం తెలుపుతున్న ముస్లింలు

టేక్మాల్(మెదక్): జమ్మూ కాశ్మీర్‌లోని పహెల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా టేక్మాల్‌లో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం ప్రార్థనలో పాల్గొన్నారు. ఉగ్రదాడిలో చనిపోయిన 27 మంది భారతీయులకు వారు సంతాపం తెలిపారు. హిందుస్తాన్ జిందాబాద్, పాకిస్తాన్ ముర్దాబాద్ అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనారిటీ రైట్ ప్రొటెక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎంఏ సలీం మాట్లాడుతూ భారత్‌పై ఇలాంటి ఉగ్రదాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రం చర్యలకు భారతీయులుగా తామంతా అండగా నిలుస్తామన్నారు. అవసరమైతే దేశం కోసం ప్రాణాలను సైతం అర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మౌలానా షహర్‌యార్ ఖాన్, సయ్యద్ వసీం, జమీర్, నదీం, సయ్యద్ రెహ్మాన్, ఆసిఫ్, దస్తగిర్ పటేల్, అలీ, సయ్యద్ ఇమ్రాన్, జహీర్, షాహిద్ సయ్యద్ చిన్న వసీం, రహ్మత్, సల్మాన్, హాఫీజ్, నాజిం, షేక్ అహ్మద్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- చెరువును చెరబడుతూ మట్టిదందా
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


చింతల్‌చెరువులో మట్టిని తరలిస్తున్న వ్యాపారులు

చిన్నశంకరంపేట(మెదక్): అక్రమ మట్టిదందా నిర్వాహకులు చెరువులను చెరబడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నార్సింగి మండలంలోని చెరువుల్లో నిత్యం మట్టిని తవ్వి వెంచర్లకు తరలిస్తున్నారు. తాజాగా జప్తి శివనూర్ మధిర గ్రామం కాస్లాపూర్ చింతల చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి వెంచర్‌కు తరలించారు. ఇదేమని అడిగితే తమకు అనుమతులు ఉన్నాయని మట్టి వ్యాపారులు దబాయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయం అధికారులకు సమాచారమిస్తే ముందు మట్టి వ్యాపారులకు ఫోన్ చేసి తాము వచ్చేవరకు వాహనాలను అక్కడి నుంచి పంపివేయాలని చెబుతున్నట్లు అధికారులకు సమాచారం ఇచ్చినవారు వాపోతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రతి రోజు రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు మట్టిని తరలిస్తూ అక్రమార్కులు ఆదాయం పొందుతున్నారు.

గతంలో అమ్మకుంటను చెరబట్టారు..

ఆరు నెలల క్రితం నార్సింగి మండలం జప్తిశివనూర్ అమ్మకుంట నుంచి అక్రమంగా మట్టిని తరలించారు. అమ్మకుంట గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఈ విషయంపై గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఇరిగేషన్ అధికారులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు తీసుకోలేదు. తాజాగా నర్సంపల్లిపెద్ద తండాలోని చెరువులోనూ మట్టిని తరలించారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ శాఖ అధికారులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఇలా నిత్యం తమ అవసరాలకు చెరువులు, కుంటలను తవ్వి మండల కేంద్రంలోని వెంచర్‌లకు మట్టిని తరలిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మట్టిదందాకు చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉగ్రవాదులపై కఠినంగా వ్యవహరించాలి

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా జిల్లావ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నినదించారు. అమరవీరులకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.


శివ్వంపేట(నర్సాపూర్): నవాబుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు


చేగుంట(తూప్రాన్): ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం పెద్దలు


నర్సాపూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ


శివ్వంపేటలో...


నర్సాపూర్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ముస్లింలు